మాజీ మంత్రి పొన్నాలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కోర్టుకు హాజరైన మాజీ మంత్రి పొన్నాల

జనగామ, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : జనగామ జిల్లా సాధన ఉద్యమంలో భాగంగా అప్పట్లో నమోదైన కేసు విచారణ కోసం మంగళవారం మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య జిల్లా కోర్టుకు హాజరయ్యారు. అంతకుముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన పొన్నాలను స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ధర్మపురి శ్రీనివాస్, మాజీద్, పంతులు, మసియోద్దీన్, గౌస్‌పాషా తదితరులు స్వాగతం పలికి సత్కరించారు. ఇదే కేసులో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్తా తదితరులు కూడా కోర్టుకు హాజరయ్యారు.

పారిశుధ్యంపై స్పందించిన అధికారులు

'నమస్తే తెలంగాణ' కథనంతో ట్రాక్టర్‌తో చెత్త సేకరణ

చెత్తను ట్రాక్టర్‌లో ఎత్తుతున్న జీపీ సిబ్బంది

నర్మెట, ఆగస్టు 13 : మండలంలోని వెల్దండలో పారిశుధ్య సమస్య పరిష్కారం కోసం చెత్త సేకరణకుగాను పంచాయతీ అధికారులు ట్రాక్టర్‌ను సమకూర్చారు. సంతలో ముగిగిపోయిన కూరగాయలు, చెత్తచెదారం పేరుకుపోతున్న విషయమై ఈ నెల 12న 'నమస్తే తెలంగాణ'లో 'గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే..' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. వీధుల్లో పారిశుధ్య పరిరక్షణకు, ఇంటింటి నుంచి చెత్త సేకరణకు మంగళవారం ట్రాక్టర్‌ను పంపారు. దీంతో స్థానికులు 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు.

కొడకండ్లలో ఘనంగా బోనాల పండుగ

కొడకండ్ల, ఆగస్టు 13 : మండల కేంద్రంలో బోనాల ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. బయన్న వాగు వద్ద బయ్యన్నకు మహిళలు బోనాలు సమర్పించారు. ఉదయం నుంచే తరలివచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల ఆట పాటల నడుమ సాయంత్రం పెద్ద ఎత్తున మహిళలు బోనాలు సమర్పించారు. కాల భైరవ స్వామికి పూజలు చేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

జఫర్‌గఢ్, ఆగస్టు 13 : మండలంలోని కూనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ విద్యార్థులకు పాఠశాల గోల్డెన్ జూబ్లీ కమిటీ సభ్యులు స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థులు గోల్డెన్ జూబ్లీ కమిటీగా ఏర్పడి పాఠశాలలో మౌలిక వసతులకు నిధులు సమకూర్చారు. ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల్లో అగ్రభాగాన నిలిచేందుకు స్టడీ మెటీరియల్‌ను అందించారు. కార్యక్రమం లో హెచ్‌ఎం ఫర్వేజ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి : సీఐ

ప్రజలతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

చిల్పూరు, ఆగస్టు 13 : రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాలలో మంగళవారం గ్రామస్తులు, ప్రయాణికులతో ఆయన మాట్లాడారు. హైవేపై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్, మాజీ సర్పంచ్ తాళ్లపల్లి సమ్మయ్య, నాయకులు గజ్జెల దామోదర్, తాళ్లపల్లి జగనాథం, జనగామ యాదగిరి, తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, దోమ రవీందర్‌రెడ్డి, శ్యామ్, ఇల్లందుల యాదగిరి, అశోక్, వెంకటస్వామి, హరిబాబు పాల్గొన్నారు.

నేడు నర్మెటలో ఉచిత కంటి వైద్య శిబిరం

నర్మెట, ఆగస్టు 13: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో హనుమకొండ శరత్ మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం వారొక ప్రకటన విడుదల చేశారు. వైద్య శిబిరానికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యశిబిరానికి హాజరుకావాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలకు పేయింట్ వితరణ

పేయింట్ అందిస్తున్న దాత చంద్రమౌళి

బచ్చన్నపేట, ఆగస్టు 13 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి దొంతుల చంద్రమౌళి, జూనియర్ అసిస్టెంట్ మున్నా రూ.20 వేల విలువైన పేయింట్‌ను మంగళవారం అందించారు. ప్రధానోపాధ్యా యుడు వెంకట్‌రెడ్డి సమక్షంలో అందించి మాట్లాడారు. తాము చదుకున్న పాఠశాల అభివృద్ధికి సాయం చేశామని చంద్రమౌళి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరుని పృథ్వీరాజ్, గట్టు రామచంద్రం, యాదగిరి, లక్ష్మి విజయలక్ష్మి, నస్రత్, నిర్మల, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మహంకాళి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 13 : మండలంలోని సముద్రాలలో మహంకాళి ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేస్తున్నట్లు కందూరు సోమిరెడ్డి, నాగమణి దంపతులు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పురాతన మహంకాళి ఆలయం స్థానంలో నూతన ఆలయం నిర్మించ నున్నట్లు వివరించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర హాజరవుతారని తెలిపారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి

మైనారిటీ కళాశాల, పాఠశాలల తనిఖీలో కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా

కళాశాలలో భోజనశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా

జనగామ, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని మైనారిటీ జూనియర్ కళాశాలతో పాటు రెసిడెన్షియల్ పాఠశాల, మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. చదువను నిర్లక్ష్యం చేయొద్దని, విద్యార్థి దశలో ప్రతి నిమిషం ఎంతో విలువైందని తెలిపారు. శ్రద్ధ చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించి ఉన్నత విద్యను అభ్యసించాలని ఆయన కోరారు. విద్యార్థులకు ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పాఠశాలలో మౌలిక వసతులపై దృష్టి సారించాలని అధికారులను ఆయన కోరారు. అనంతరం విద్యార్థుల వసతి గృహాలను, కళాశాల, పాఠశాలకు సంబంధించిన వంటశాలలను, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా? లేదా? అని తెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించి వారిని ఇంప్రూవ్ చేయాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రవీందర్, కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి ఉన్నారు.

గుణాత్మక విద్యను అందించాలి : కలెక్టర్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలో అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలపై మండల నోడల్ అధికారులు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాము, జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, జిల్లా సమగ్ర శిక్షణ కో-ఆర్డినేటర్లు పాల్గొన్న సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థుల నమోదు మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, మొదటి నిర్మాణాత్మక మూల్యాంకన ఫలితాలపై సమీక్షించారు. తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన తీరును విద్యార్థుల భాగస్వామ్యం, ఉపకరణాల ఉపయోగంపై పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. పీఎం శ్రీపథకం కింద ఎంపికైన పాఠశాలల్లో పనుల పురోగతిపై ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లు, ఇంజినీరింగ్ విభాగం అధికారులను అడిగి తెలుసుకున్నారు. నవంబర్‌లో నిర్వహించే (నేషనల్ నేషనల్ అచీవ్మెంట్ సర్వే) జాతీయ సాధన సర్వేలో జిల్లా మంచి ఫలితాలను సాధించాలనిఆదేశించారు. ఉపాధ్యాయులు అనధికారిక సెలవులో గనుక ఎవరైనా ఉన్నట్లయితే వారిపై తగిన చర్యలు ఉంటాయన్నారు. ఉచిత స్కూల్ యూనిఫామ్‌లు రెండో జత కూడా అన్ని పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు చేరే విధంగా చూడాలని సూచించారు. నేషనల్ అచీవ్మెంట్ సర్వేకు సంబంధించి ప్రశ్న పత్రాలను జిల్లా స్థాయిలోనే రిసోర్స్ పర్సనల్ ద్వారా తయారు చేయించి మండలాలకు పంపిణీ చేయాల న్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు

- ఉదయం 11 గంటలైనా విధులకు రాని వైనం
- శాతాపురం ప్రాథమికోన్నత పాఠశాల దుస్థితి

పాఠశాలకు ఉపాధ్యాయులు రాకపోవడంతో బయట కూర్చున్న విద్యార్థులు

పాలకుర్తి రూరల్, ఆగస్టు 13: విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరు కాని వైనమిది. ఉదయం 11 గంటలైనా టీచర్లు రాకపోవడంతో విద్యార్థులు పాఠశాల బయట కూర్చున్న ఉదంతం మంగళవారం మండలంలోని శాతాపురంలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని శాతాపురంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులుండగా, వీరిలో ఇద్దరు పదోన్నతితో ఇటీవల బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం ఒక్కరే ఉపాధ్యాయురాలు ఉన్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 11 గంటల వరకూ పాఠశాల తెరుచుకోలేదు. మరోవైపు ఉపాధ్యాయురాలు ఈ నెల 5వ తేదీన విద్యాశాఖ అధికారులకు, ఎంఈవోకు చెప్పకుండానే విధులకు గైర్హాజరయ్యారని నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య తెలిపారు. సెలవు కావాలంటే సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడితో పాటు మండల విద్యాశాఖాధికారికి లీవ్ లెటర్ రాసి అనుమతి తీసుకోవాలని తెలిపారు. కానీ ఆ ఉపాధ్యాయురా లు నిబంధనలకు విరుద్ధంగా విద్యాశాఖ అధికారుల అనుమతి లేకుండా ఈ నెల 5న లీవ్ లెటర్ రాసి పాఠశాలలోని రిజిస్టర్‌లో పెట్టి వెళ్లిందని విద్యాశాఖాధికారులు తెలిపారు. మంగళవారం సదరు ఉపాధ్యాయురాలు విధులకు రాకపోవడంతో విద్యార్థులు ఆరు బయట కూర్చున్నారు. వారం రోజులుగా ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులు వచ్చి పోతున్నారు. ఈ పరిస్థితిలో విద్యాశాఖాధికారులు సీఆర్పీ సరేశ్‌ను పాఠశాలకు పంపించారు. ఆయన కూడా వారం రోజులుగా మధ్యాహ్నం వరకే పాఠశాలను నిర్వహించి ఇంటికి వెళుతున్నారని విద్యార్థులు వాపోయారు. మంగళవారం సరేశ్ సైతం పాఠశాలకు రాకపోవడంతో వి ద్యార్థులు ఆరుబయట ఆటలు ఆడుకున్నారు. విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవంతో విద్యా వ్యవస్థ దెబ్బతింటున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తక్షణమే పాఠశాలకు డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను నియమించాలని జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారిని గ్రామస్తులు కోరారు.

లైంగిక వేధింపులకు
పాల్పడిన వ్యక్తిని శిక్షించాలి

బీఆర్‌ఎస్ నాయకుల డిమాండ్

పాలకుర్తి రూరల్, ఆగస్టు 13: మండల కేంద్రంలోని వెలుగు బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల అశోక్ రెడ్డి కోరారు. మంగళవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తితో పాటు ఘటనకు సంబంధించిన అధికారులు, వంట కాంట్రాక్టర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాలలో మెస్ బాగా లేదని, దీంతో ఆకలితో విద్యార్థినులు అలమటిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎఫ్‌ఎస్‌సీఎస్ వైస్ చైర్మన్ కారుపోతుల వేణు, మాజీ ఎంపీటీసీ మాటూరి యాకయ్య, గుగ్గిళ్ల యాకయ్య, కటారి పాపారావు, దొంతమల్ల గణేశ్, దారవత్ యాకూబ్, పట్టణ అధ్యక్షుడు కడుదుల కర్ణాకర్ రెడ్డి, వీరమల్ల దేవేందర్, కమ్మగాని వెంకటేశ్, నారగోని ప్రభాకర్, వీరమనేని గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించిన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే జీ విజయరామారావు

యువత దేశభక్తిని
పెంపొందించుకోవాలి

స్టేషన్ ఘన్‌పూర్/నర్మెట, ఆగస్టు 13 : యువత ఉన్నత చదువులతోపాటు, దేశభక్తిని పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే గుండె విజయరామారావు అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ దూసరి విజయ్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. విజయరామారావు మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు ఇంటింటా త్రివర్ణ పతాకాలను ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు మంద రాజేశ్, నియోజకవర్గ కన్వీనర్ అంజిరెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నర్మెట మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ జెండాలను చేబూని ర్యాలీ నిర్వహించారు. దేశభక్తిని యువత పెంపొందించుకోవాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు బొల్లం అవినాశ్, బీజేపీ మండల అధ్యక్షుడు దరావత్ రాజు, నాయకులు సొక్కం అనిల్‌కుమార్, అంజనేయులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన
వ్యక్తిని కాపాడిన పోలీసులు

రఘునాథపల్లి, ఆగస్టు 13 : కుటుంబ తగాదాలతో భార్యతో గొడవపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు స్పందించి కాపాడారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని నిడిగొండకు చెందిన తుడి సతీశ్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని వెల్లదీస్తున్నాడు. మంగళవారం కుటుంబ తగాదాలతో భార్యతో గొడవ పడి ఆత్మహత్య చేసుకుంటానని రైలు పట్టాలపైకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు 100 డయల్ చేయడంతో వెంటనే పోలీసు సిబ్బంది స్పందించి సతీశ్‌ను రక్షించారు. కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మల్లేశం (ఫైల్)

రఘునాథపల్లి, ఆగస్టు 13 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినసంఘటన మంగళవారం మండలంలోని ఇబ్రహీంపూర్‌లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 10న మధ్యాహ్నం దొరగొళ్ల మల్లేశం(24) మద్యం సేవించి ఇంటికి రాగా భార్య అనూష మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన మల్లేశం గడ్డిమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఆసుపత్రికి తరలించగా మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

ఆగ్రో సేవా కేంద్రంలో అదనపు వసూళ్లపై ఆందోళన

నిర్వాహకుల మోసాలపై రైతుల నిరసన

ఆగ్రో సేవా కేంద్రం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

జనగామ, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : ఎరువుల షాపుల్లో ఎమ్మార్పీ ధరల కంటే అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆగ్రో సేవా కేంద్రం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. సేవా కేంద్రం నిర్వాహకుల మోసాలపై జిల్లా వ్యవసాయ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామావత్ మీట్యానాయక్ అన్నారు. ఇటీవల ఆగ్రో సేవా కేంద్రంలో యూరియా కొనుగోలు చేస్తున్న రైతుల నుంచి ఎమ్మార్పీ కంటే అధికంగా ఒక్కో బస్తాపై రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. యూరియా కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉపేందర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు దడిగ సందీప్, నాయకులు బోడ రాములు, ఎన్‌హెచ్‌ఆర్‌సి రాష్ట్ర నాయకులు యాసారపు కర్ణాకర్, మోహన్, మారబోయిన కమలాకర్, శ్రావణ్ పాల్గొన్నారు.

నీర్మాలలో అనుమతి లేని అక్రమ వెంచర్ల కూల్చివేత

వెంచర్‌లోని షెడ్డును కూల్చుతున్న అధికారులు

దేవరుప్పుల, ఆగస్టు 13: అనుమతులు లేకుండా మండలంలోని నీర్మాలలో వెలిసిన వెంచర్లను మంగళవారం తహసీల్దార్ హుస్సేన్, మండల పంచాయతీ అధికారి సురేశ్‌కుమార్ తనిఖీ చేశారు. షెడ్డును కూల్చివేసి ప్లాటింగ్ హద్దురాళ్లు, రోడ్లను తొలగించారు. నీర్మాలలో 23 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి ప్రభుత్వ అనుమతులు లేకుండా రియలెస్టేట్ చేయడానికి భూమి యజమానులు ప్లాటింగ్, రోడ్లు ఏర్పాటు చేశారు. దీనిపై సోమవారం గ్రామస్తులు కలెక్టరేట్ గ్రీవెన్స్‌సెల్‌లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌భాషా షేక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు తమ సిబ్బందితో రంగంలో దిగి డోజర్‌తో వెంచర్‌లోని షెడ్డును కూల్చి వేశారు. ప్లాటింగ్‌కు ఏర్పాటు చేసిన హద్దు రాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతులు లేకుంగా వెంచర్లు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు రాజు, ఆంధ్రయ్య పాల్గొన్నారు

మృతుడి కుటుంబానికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న మిత్రులు

జఫర్‌గఢ్, ఆగస్టు 13 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988-89లో పదో తరగతి చదివిన కలువల సత్తయ్య(51) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటలో ఉంటున్న సత్తయ్య మరణ వార్త తెలుసుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమం లో ఏడుదొడ్ల తిరుపతిరెడ్డి, లోనె నాగేశ్వర్‌రావు, పిన్నింటి శ్రీనివాస్, పొనుగోటి సోమేశ్వర్‌రావు, జ్యోతి,ఎల్లయ్య, బాబా ఫకృద్దీన్, పూర్ణచందర్, మల్లయ్య, వేణుమాధవ్, సిద్దం లింగయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

బచ్చన్నపేట : మండలంలోని కొన్నె గ్రామంలో చల్ల రవి తల్లి యాదమ్మ మృతి చెందారు. మృతురాలి కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకుడు కోడూరి శివకుమార్‌గౌడ్ పరామర్శించి సంతాపం తెలిపారు. అంత్యక్రియల కోసం రూ.5 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, నర్సయ్య, రాజేశ్, అశోక్, రాజు, కిషన్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి
పలువురి పరామర్శ

జనగామరూరల్, ఆగస్టు 13 : మండలంలోని పెంబర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుర్రి వెంకటయ్య మృతి చెందగా ఆ కుటుంబాన్ని మంగళవారం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు సిద్దులు, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, సీనీయర్ నాయకులు అంబాల శ్రీనివాస్ గౌడ్, కార్యదరిశ దుర్గాచలం సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో వంశీదర్‌రెడ్డి, యాదగిరి, హన్మంతరావు, స్వామి, సమ్మయ్య, ఇబ్రహీం, మహేందర్, దుర్గాచలం, ఎల్లయ్య, కోటేశ్వర్, ప్రభాకర్, నర్సింహులు, వెంకటయ్య, గిరి,భాను, సత్తయ్య పాల్గొన్నారు.

గ్రామాలకు
ఆర్టీసీ బస్సులు నడుపాలి

జనగామరూరల్, ఆగస్టు 13 : జనగామ మండలంలోని పలు గ్రామాలకు బస్సు సర్వీసులు లేక వృద్ధులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆర్టీసీ డిపో మేనేజర్ స్వాతికి మానవహక్కుల ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎడ్ల శ్రీనివాస్, అరుణ్‌కుమార్, తిరుపతి, రాజు, బక్క శ్రీనివాస్, ఉమాపతి, సురేశ్, చందు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ అన్ని గ్రామాల నుంచి జనగామకు వెళ్లేలా బస్సులు నడుపాలన్నారు. పుణ్య క్షేత్రాలైన తిరుపతి, వేములవాడ, యాదగిరిగుట్టకు బస్సులు నడుపాలని విజ్ఞప్తి చేశారు.

ముల్కనూర్‌లో నర్మెట మోడల్ స్కూల్ విద్యార్థులు

క్షేత్రస్థాయి పరిశీలనతో విద్యార్థులకు విజ్ఞానం

నర్మెట, ఆగస్టు 13 : క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించడం ద్వారా విద్యార్థులకు విజ్ఞానం బోధపడుతుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శరత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు అగ్రికల్చర్ కోర్సులో భాగంగా క్షేత్ర పర్యటనకు ముల్కనూర్ డెయిరీ, ముల్కనూర్ కోఆపరేటివ్ సొసైటీని మంగళవారం సందర్శించారు. యాజమాన్య పద్ధతులు, స్వయం ఉపాధి కల్పన, రైతులకు ప్రయోజనాలను తెలుసున్నారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ టీచర్ అనిల్‌రెడ్డి, సాయిబాబా, మౌనిక, ముల్కనూరు డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు మైక్‌సెట్ అందజేత

బచ్చన్నపేట, ఆగస్టు 13 : మండలంలోని సాల్వాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన చీర్ల మల్లేశం మంగళవారం మైక్‌సెట్ అందించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూతనివ్వాలనే ధ్యేయంతో మైక్‌సెట్ అందించినట్లు ఆయన తెలిపారు. మైక్‌సెట్ అందించిన మల్లేశంను ప్రధానోపాధ్యాయులు మధుకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీహరిచారి, బత్తిని వెంకటేశ్, నిమ్మల రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గొడుగుల పంపిణీ

గొడుగులను పంపిణీ చేస్తున్న కుమారస్వామిగౌడ్

పాలకుర్తి, ఆగస్టు 13: మండలంలోని మల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం వీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు మొలుగూరి యాకయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమార్‌స్వామిగౌడ్ మాట్లాడారు. సమాజ శ్రేయసుస్సు కోసం వెన్నెల ఉమారాణి(వీఆర్) ఫౌండేషన్ చేస్తున్న సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, తోటకూరి శ్రీనివాస్‌యాదవ్, చింత వెంకన్న, గర్వందుల వీరస్వామి, సంపత్ మల్లయ్య, అక్కిరెడ్డి శ్రీను, మార్తశేఖర్, దేవర వెంకన్న పాల్గొన్నారు.

నేడు పాలకుర్తిలో పోచమ్మ బోనాలు

పాలకుర్తి, ఆగస్టు 13: మండల కేంద్రంలోని పోచమ్మ తల్లి ఆలయంలో బుధవారం బోనాల పండుగను నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటాచారి తెలిపారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకొని పోచమ్మతల్లికి బోనాలు సమర్పించేందుకు ఏర్పాట్లు చేశామని మంగళవారం తెలిపారు. భక్తులు బోనాల పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన కోరారు.

'మిషన్ భగీరథ' పైపులైన్‌కు లీకేజీ..

బచ్చన్నపేట, ఆగస్టు 13 : మండల కేంద్రంలోని గోపాల్‌నగర్ చౌరస్తాలో మిషన్‌భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. నాలుగు రోజులనుం చి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు తెలిపారు. తమ కాలనీకి నీళ్లు రావడం లేదని ఆ ప్రాంత వాసులు పేర్కొన్నారు. వాటర్ లీకేజీతో ఈ ప్రాంతం బురదమయమైంది. అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని కోరారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

జనగామ, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : వనిత, వాసవీ క్లబ్ సహా ఎన్‌ఆర్‌ఐలు దుడుక కరుణ శ్యాం, శైలజ దివాకర్, రజిని ఆశిష్ ఆధ్వర్యంలో జనగామ మండలం చౌడారం హైస్కూల్ విద్యార్థులకు రూ.60 వేల విలువైన క్రీడా దుస్తులు, ఆట వస్తువులు, భోజనం ప్లేట్లను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వనిత క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ వరూధి, కార్యదర్శి గంగిశెట్టి అనుజ, వాసవీ క్లబ్ అధ్యక్షుడు పడకంటి రవీందర్, డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్, ఉపాధ్యక్షులు బెజుగం భిక్షపతి, పాఠశాల హెడ్మాస్టర్ గాడిపెల్లి రమేశ్ బాబు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గజ్జెల దామోదర్, నాయకులు

18న పద్మశాలి సంఘం రాష్ట్ర ఎన్నికలు

చిల్పూరు, ఆగస్టు 13: పద్మశాలి సంఘం రాష్ట్ర ఎన్నికలు ఈ నెల 18న హైదరాబాద్‌లో జరుగుతాయని సంఘం మండల అధ్యక్షుడు, చేనేత కార్మికుల ఐక్యవేదిక స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జెల దామోదర్ తెలిపారు. మండలంలోని చిన్నపెండ్యాలలో ఆదివారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బాలరాజు పాల్గొనగా దామోదర్ మాట్లాడుతూ ఈ ఎన్నికలకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి ప్రతినిధులు తరలిరావాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా వల్లకాటి రాజకుమార్ గెలిపించాలని ఆయన కోరారు. నాయకులు రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు, నాగభూషణం,జ్ఞానేశ్వర్, కుమారస్వామి, అశోక్, రమేశ్ పాల్గొన్నారు.

బాలికను అపహరించిన వ్యక్తి రిమాండ్

దేవరుప్పుల, ఆగస్టు 13: మండలంలోని ఓ గ్రామం నుంచి ఈ నెల 5న బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా రాయచోటికి చెందిన కొర్లకంట నరేశ్ ఈ నెల 5న మండలానికి చెందిన ఓ బాలికకు తన వెంట తీసుకెళ్లాడు. దీనిపై ఆమె తాత వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన పోలీసులు దర్యాప్తు చేయగా మంగళవారం గొల్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద పోలీసులకు చిక్కాడు. నరేశ్‌ను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలిస్తూ జడ్జి ఆదేశించారని ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు.

అనారోగ్యాన్ని తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య

జఫర్‌గఢ్, ఆగస్టు 13 : అనారోగ్యాన్ని తట్టుకోలేక మండలంలోని కూనూరుకు చెందిన కొలిపాక సదయ్య (42) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొలిపాక సదయ్య గ్రామంలో క్షౌర వృత్తి చేస్తున్నాడని, కొద్ది రోజులుగా హైడ్రోసిల్ నొప్పితో బాధపడుతున్నాడన్నారు. దీనిని భరించలేక మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీజ్

చిల్పూరు,ఆగస్టు 13 : మండలంలోని వెంకట్రాదిపేటలో తడగోని నరేందర్ బెల్ట్‌షాపును మంగళవారం పోలీసులు తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ చేసిన రూ.4200 విలువైన మద్యాన్ని సీజ్ చేశారు. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా మద్యాన్ని విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై జయకుమార్, కానిస్టేబుల్ వీరన్న పాల్గొన్నారు.